# పల్లెపడుచు ::

రచన:
"వల్లరి"

సుప్రభాతము. ప్రత్యూషరేఖలు కెంపునగవులలో మురిసిపోతున్నవి. దూరపు కొండకోనలలో పక్షుల కిలకిలారావములు మృదువుగా ప్రతిధ్వనిస్తున్నాయ్.

కృష్ణా గోదావరీ నదుల సంగమస్థానం. తూర్పులాకులు. దాని కానుకొనే బ్రిడ్జి. ఆ నదీ సంగమస్థానం ప్రక్కగా మామిడితోట. తోట మధ్య పూరిల్లు. ఇంటిముందు మట్టిఅరుగులు బాటసారులు మార్గాయాసం తీర్చుకొనేందుకు వుపయోగపడ్తాయ్.

ఆ పల్లెపడుచు సన్ననిగొంతుతో భూపాలరాగములు ఆలపిస్తూ ప్రాంగణమున రంగవల్లికలు రమణీయంగా చిత్రించింది. చేతకడవనిడి లేడిపిల్లలా నడచివెళ్తుంది నీలాటిరేవుకు.

రంగురంగుల పూలతోను, వివిధ సుమపరాగములతోను, మధూదయ విలాసాన్ని మలయించుకొన్న పూదోటకుపోయి పూలసేరుకొంటుంది. ఊడలపై వుయ్యాలలూగుచున్న మఱ్ఱిచెట్టునీడలో కూర్చుని పూలమాలలకు మిటారిపోకడలు కూర్చుతుంది, హృదయరంజకమైన పాటలు పాడుచూ, తూర్పుకొనలనుండి పైకెరుదెంచుచున్న సూర్యభగవానుని తిలకిస్తూ !!

ఎవరి రాకకొఱకో ఆమె అలా కండ్లు కాయలుకాచేట్టు ఎదురుచూచుట? ఎవని మాలాలంకృతుని చేయుటకో, ఆ పుష్పమాలలు !!...... కాని—ఆ మాలలు వసివాడి వడలిపోయేది-నిరాశా నిస్పృహలలో సొలసిపోయేవి.

పల్లెపడుచు— గోదావరీ తీరాన్న పచ్చిక బయలులో, అర్థశయనావస్థలో సుందరమైన స్వప్నాలు కంటూండేది.

ఆ శుభ్రజ్యోత్స్నలో ఆమె కండ్లు ప్రకాశవంతంగా వున్నై !

స్వచ్ఛమైన నదీజలంలో మేఘాలు చిందులు తొక్కుతూండేవి. కన్నె కోయిలమ్మ వీనుల విందు గొలుపు శృంగారగీతము లాలపిస్తూండేది. కృష్ణా గోదావరీ జలపూరిత కమ్మతెమ్మెరలు హృదయాన్ని పాలతరగలందు తేలుస్తూండేవి.

పెదిమెలమీద చిరునవ్వుతో ఆస్వాదిస్తుండేది ఆమె.........

అప్సరసలువచ్చి తనముందు నాట్యంచేస్తున్నట్టు— చిన్నికృష్ణుని గజ్జెల ఘల్ ఘలులు— తాను నునుసిగ్గుతో అఱ్ఱుచాచి గోపబాలుని వేణునాద మాలకిస్తున్నట్టు——యేవేవో సుందర స్వప్నాలు మెఱుపల్లే మెఱసిపోతూండేవి.

మధురచంద్రికా లతాంగి యేదో తియ్యటి భావాల్ని రేకెత్తేది ఆమెలో. ఆమె మానసిక వీధిలో ఏదో బండరాయియై నిలిచేది. నైరాశ్యత ఆవరించేది. తదేకధ్యానంతో ఆలోచిస్తుండేది. మధ్యమధ్యను చేతినున్న అంగుళీయముపై పరీక్షా దృష్టుల ప్రసరింపజేస్తుంది. శకుంతల కథ జ్ఞప్తికి వచ్చేదేమో ! దీర్ఘ నిశ్వాసములు గాలిలో ఐక్యత చెందేవి......

నదిఒడ్డున పొడుగ్గా పెరిగివున్న మఱ్ఱిచెట్ల నడుమనుండి జ్యోత్స్నకిరణాలు ఆమె ముఖంమీద వింతగా పడుతూండేవి. కనుచూపుమేరలో నెమఱ వేసే ఆవుల మెళ్ళోగంటలు "టింగు—టింగు" ప్రోతలు ప్రశాంతత పాడుచేస్తూండేవి. ఆమె లోలోపల యేడ్చేది—కళ్లు బరువుచే క్రుంగిపోయేవి.

• • •

పాపం—ఇట్టి విషాద జీవితం ఆమె కెలా తటస్థించిందో ...??

అబ్బ—ఎంతపని జరిగింది. ఆనాడు ఈరానీ పడుచు వచ్చింది కత్తెలమ్ముతూ. తెల్లని ముఖ వర్చస్సు, ముక్కుకు మెఱిసిపోయే నీలిరాయి బేసరి. నల్ల లంగా, పొడుగుచేతుల చొక్కా ధరించింది. ద్విజడలుగల శిరస్సుకు తెల్లనిరుమాలు కట్టింది. మెఱసే కళ్లూ—ఎత్తయిన వక్షస్థలము—యవ్వనం పొంగిపొరలిపోతోంది.

తనభర్త పిలిచారా మనిషిని. కత్తులు బేరం చేస్తూన్నారు. "అడుగు మహరాజ్" అంది తెలింగానాలోనే.

కొన్ని సెకనులు ప్రశాంతత నెలకొంది. ఆమె క్రీగంటి చూపులూ—అతని బరువైన చూపులూ...

ఆమె మతిపోతోన్నట్టయింది.

ఇహ వారి సంభాషణ తురకంలోకి మారింది. ఈరానీ పడుచు అడిగింది "అమ్మగారూ—కాసినీ మాంచినీళ్లు తేండీ"

..................

మంచినీళ్లు పట్టుకువచ్చేసరికి ఈరానీ మటుమాయమైంది. అతని చిఱునవ్వు ఆమె హృదయాన్ని తొలచివైచింది. ఆమె మతి పూర్తిగా పోయినట్టయింది.

ఆమెకు నమ్మికవుంది. తన భర్తపై యీషన్మాత్రమూ ఈర్ష్య పెంచుకోలేకపోయింది. అతడు తనవాడే, తనను వదలి వెళ్ళిపోడు—అని నిర్ధారణ చేసుకొంది.

తానొకటి తలచిన దైవమొకటి తలచును.

రెండురోజులైంది భర్త ఇంటికివచ్చి. ఈరానీ ముఠా ఆ గ్రామంవిడిచి వెళ్ళిపోయారని తెలిసింది. ఆమె అనుమానం, భయం, నిజరూపం తాల్చాయ్.

కాని ఆమె నమ్మిక యేమాత్రము సడలలేదు. ఆమెకు తెలుసును అది మూడురోజుల ముచ్చటేనని. తిరిగివస్తాడని—తప్పకుండా.........

అందుకనే ఆమె అలా కండ్లు కాయలు కాచేట్టు ఎదురుచూడడము, ఊహాసౌధాలు నిర్మించుకొనడం.

* * *

వసంతము ప్రవేశించింది. సుమపరాగములనో ప్రకృతి కైపెక్కింది. శరచ్చంద్రికాలతాంగి తన మృదుహస్తములతో ప్రియుల హృదయతంత్రులను నెమ్మదిగామీటి ప్రేమగీతము లాలపిస్తోంది. వనకుమారి మృదు శృంగారగీతములను మలయపవనములు మోసుకొని వస్తున్నాయ్!

ఆమె—పడచు—పూలమాలలు కట్టుతోంది—అతిరమణీయంగా—కడువన్నెచిన్నెలతో.

ఆమె ఏదో దీర్ఘాలోచన చేస్తోంది. ఒకవేళ తొలినాటిరేయి కావించుకొనిన బాసలేమో!! మధ్యమధ్యను దృష్టులంగుళీయముపై ప్రసరిస్తాయ్! వేడినిట్టూర్పొకటి బహిర్గతమౌతుంది.

"జై సీతారాం! భిక్షాందేహి జగతీమిధ్య జీవితం దుఃఖమయం, సంసారం మాయ, ఆశ్రమవాసం జీవితశరణ్యం...' అనే ధోరణిలో రాగయుక్తంగా పాడుచూ నుంచున్నాడొక సాధువు.

ఆమె అతనివంక చూచింది. పోయినవస్తువు తిరిగి దొఱకినట్టుగా చూచింది—దీర్ఘంగా. తన అంగుళీయమొక పర్యాయం చూచుకొంది. మళ్ళీ అతనివంక దీక్షగా చూసింది.

ఆ భిక్షువు తొట్రుపడ్డాడు. కమండలం చేతినుండి జారిపడింది. ప్రతిఅంగము కంపించిపోయింది.

ఆమె మాలతీసుకొని వచ్చింది.

భిక్షుడు వెనుదిరిగి వెళ్లిపోయాడు—చాలా దూరం.